

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రవీందర్‌రెడ్డి

## స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

● ఎంపీపీ రవీందర్‌రెడ్డి

సూర్యాపేట రూరల్, డిసెంబర్ 7 : గ్రామాలను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుతూ స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బందికి నిర్వహించిన సమీక్షలో పాల్గొని మాట్లాడారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా నర్సరీల పనులు పూర్తి చేయాలన్నారు. గ్రామ పంచాయతీల రికార్డులను సోషల్ ఆడిట్‌లో సమర్పించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు, ఎంపీఓ పరాంకుశరావు, ఏపీఓ వెంకన్న, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి కరాటే పోటీలకు నవ్య

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 7 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రాయిపల్లికి చెందిన జెట్ట నవ్య జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికైంది. గురువారం నల్లగొండలో జరిగిన రాష్ట్రస్థాయి 67వ ఎస్జీఎఫ్ కరాటే పోటీల్లో నవ్య ప్రతిభకనబర్చి బంగారు పథకాన్ని సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమెను ఉపాధ్యాయులు అభినందించారు.



ఎంపికైన నవ్య

## వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

యాదగిరిగుట్ట, డిసెంబర్ 7 : యాదగిరిగుట్ట మండలంలోని సాధువెల్లిలో గురువారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణమహోత్సవాన్ని పురోహితులు అత్యంత వైభవంగా జరిపారు. ఉదయం సుప్రభాత సేవ, వేద పారాయణం, యంత్రాభిషేకం, వాస్తు పర్యగ్ని కరణం, జప తర్పణాలు శాస్త్రోక్తంగా జరిగాయి. గర్తన్యాసం, రత్నన్యాసం, భీజన్యాసం, ధాతున్యాసం జరిపి సుమూర్తముల యంత్రస్థాపనలు, బింబ ప్రతిష్ఠ నిర్వహించారు. కళాన్యాసం ప్రాణ ప్రతిష్ఠ, నేత్రోన్మీలనం, ధేను, దర్పణ, దర్శనాలు, బలీహరణం, మహాకుంభాభిషేకం వైభవంగా జరిపారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలీ మార్కండేయ ఆలయ కమిటీ సభ్యులు బేతి బాలరాజు, బేతి గోపాల్, విశ్వనాథం, కటకం ప్రభాకర్ పాల్గొన్నారు.



సాధువెల్లిలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం



ఉర్సు ఉత్సవాలకు ముస్తాబైన దర్గా

## నేడు ఇప్పల్ల ఉర్సు

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 7 : మండలంలోని ఇప్పల్లలో అజారత్‌ఖాన్ నజిరోద్దిన్ దర్గాలో శుక్రవారం ఉర్సు ఉత్సవాలు జరుగనున్నట్లు నిర్వాహకుడు కాజాబందావెంకటసాయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

● సైబర్ సెక్యూరిటీ సెల్ డీఎస్పీ శ్రీనివాస్‌రావు

సూర్యాపేట సిటీ, డిసెంబర్ 7 : సైబర్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సైబర్ సెక్యూరిటీ సెల్ డీఎస్పీ శ్రీనివాస్‌రావు అన్నారు. ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు గురువారం పట్టణంలోని గౌతమి కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ లావాదేవీల్లో మోసాలు జరుగుతాయని, ఫోన్‌లకు వచ్చే లింక్‌లను క్లిక్ చేయకూడదని సూచించారు. ఓటీపీ నెంబర్లు, ఏటీఎం, డెబిట్ కార్డుల పిన్ నంబర్లు, బ్యాంకు అకౌంట్ సమాచారాన్ని ఇతరులకు చెపొద్దన్నారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో సులభంగా డబ్బు సంపాదించడానికి సైబర్ నేరగాళ్లు అనేక రకాల దారుల్లో మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. మోసాలపై ఫిర్యాదుకు 1930 టోల్ ఫ్రీ నంబర్, సైబర్ వెబ్ సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ భగవాన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మయ్య, డైరెక్టర్ సోమిరెడ్డి, సైబర్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, పోలీస్ టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహనన కల్పిస్తున్న సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాస్‌రావు

# వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలి

● చేనేత సేవా కేంద్రం ఏడీ పుగలేందర్

భూదాన్‌పోచంపల్లి, డిసెంబర్ 7 : మారుతున్న కాలానుగుణంగా చేనేత కార్మికులు వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలని చేనేత సేవా కేంద్రం ఏడీ పుగలేందర్ అన్నారు. గురువారం పట్టణంలో కేంద్ర ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ, చేనేత అభివృద్ధి కమిషనర్, చేనేత సేవా కేంద్రం సంయుక్తంగా చేపట్టిన చేనేత కార్మికులకు 45 రోజుల శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ తీసుకున్న కార్మికులకు రోజుకు రూ.300 స్కాలర్‌షిప్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. శిక్షణలో 23 మంది కార్మికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బాలాజీ వీవర్ సర్వీస్ సెంటర్ ఏడీ పవన్‌కుమార్, డీఎస్‌ఆర్ వీవర్స్ ప్రతినిధి దోర్నాల శేషగిరి, శిక్షకుడు భోగ బాలయ్య, కార్మికులు పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న వారికి ఫైల్ అందిస్తున్న చేనేత సేవా కేంద్రం ఏడీ పుగలేందర్



రాజాపేట సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో సిద్ధం చేసిన క్రీడా మైదానం

# రాష్ట్రస్థాయి గురుకుల క్రీడలకు ఏర్పాట్లు పూర్తి

రాజాపేట, డిసెంబర్ 7 : మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈ నెల 9 నుంచి 12 వరకు జరిగే 9వ రాష్ట్ర స్థాయి గురుకుల క్రీడలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా రీజన్ ఆర్‌సీఓ, క్రీడల ఇన్‌చార్జి ఎన్.రజిన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయిలోని 8 జోన్లకు సంబంధించిన 1,171 మంది విద్యార్థులు ఏడు విభాగాల్లో నిర్వహించే క్రీడల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, పుట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, టెన్నికైట్, కార్యమ్స్, చెస్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

## ఫిజికల్ డైరెక్టర్ ఉద్యోగానికి దరఖాస్తులు

భూదాన్‌పోచంపల్లి, డిసెంబర్ 7 : మున్సిపాలిటీ పరిధిలోని మోడల్ స్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్ (పీడీ)ఉద్యోగానికి దరఖాస్తులు కోరుతున్నట్లు టీఎస్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నరేశ్‌కుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీపీఈడీ, ఎంపీఈడీ విద్యార్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 10లోపు మోడల్ స్కూల్‌లో సంప్రదించాలని కోరారు. అర్హులైన వారు సంబంధిత సర్టిఫికెట్లతో సంప్రదించాలని పేర్కొన్నారు.



అయ్యప్ప పడిపూజ నిర్వహిస్తున్న మాలధారులు

## కనులపండువగా అయ్యప్ప పడిపూజ

బొడ్రాయిబజార్, డిసెంబర్ 7 : జిల్లా కేంద్రంలోని శభరినగర్ అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం రాత్రి అయ్యప్ప పడిపూజ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. స్వాములు భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామిని పూజించారు. కార్యక్రమంలో గోరుగంటి రవీందర్‌రావు, ఆలయ కమిటీ ప్రదాన కార్యదర్శి ఎల్గూరి రాంబాబు, కోశాధికారి బచ్చు శ్రీనివాస్, మనసాని రామ్మూర్తి ఉన్నారు.

## తాగునీటి సరఫరాకు అంతరాయం

బొడ్రాయిబజార్, డిసెంబర్ 7 : మిషన్ భగీరథ పైప్‌లైన్ల మరమ్మతుల్లో భాగంగా ఈ నెల 5, 6 తేదీల్లో నీటి సరపరాకు అంతరాయం ఏర్పడగా.. 8, 9న కూడా నిలిపివేయడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ పి.రామాంజులరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షంతో పైప్‌లైన్ మరమ్మతులు పూర్తి కాలేదని, పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

## చెల్లని చెక్కు కేసులో ప్రభుత్వ ఉద్యోగికి జైలుశిక్ష

సూర్యాపేట లీగల్, డిసెంబర్ 7 : చెల్లని చెక్కు ఇచ్చిన ప్రభుత్వ ఉద్యోగికి సంవత్సరం సాధారణ జైలుశిక్ష, జరిమానా విధిస్తూ సూర్యాపేట ప్రథమ శ్రేణి న్యాయమూర్తి కె.సురేశ్ గురువారం తీర్పునిచ్చారు. నడిగూడేనికి చెందిన చల్లా రాజశేఖర్(35), కట్టా దయాకర్ స్నేహితులు. ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న రాజశేఖర్ తన అవసరాల నిమిత్తం దయాకర్ వద్ద 2017 ఏప్రిల్ 24న రూ.70వేలు, 2018 డిసెంబర్ 27న మరో రూ.3లక్షలు అప్పుగా తీసుకున్నాడు. దయాకర్ తిరిగి డబ్బులు ఇమ్మని అడిగితే రూ.4,45,000లకు చెక్కు ఇచ్చాడు. బ్యాంకులో వేయగా డబ్బులు లేని కారణంగా చెక్కు చెల్లలేదు. బాధితుడు న్యాయవాదితో నోటీస్ పంపగా డబ్బులు చెల్లించలేదు. దాంతో బాధితుడు కోర్టును ఆశ్రయించగా.. గురువారం సాక్షులను విచారించిన న్యాయస్థానం నేరం రుజువు కావడంతో రాజశేఖర్‌కు సంవత్సరం సాధారణ జైలు శిక్ష, రూ.8.90లక్షలు నష్టపరిహారం చెల్లించాలని, చెల్లించని పక్షంలో అదనంగా మరో 3నెలల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పునిచ్చారు.



శివశక్తి అనుగ్రహపీఠంలో పూజలు నిర్వహిస్తున్న సిద్ధగురు రమణానందమహర్షి

## ఆలోచనలను బట్టే దైవానుగ్రహం

● సిద్ధగురు రమణానందమహర్షి

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 7 : మన ఆలోచనలను బట్టే దైవానుగ్రహం ఉంటుందని, ప్రతి ఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలని సిద్ధగురు రమణానందమహర్షి అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి పరిధిలోని శివశక్తి అనుగ్రహ మహా పీఠం రమణేశ్వరంలో గురువారం దశ మహాభైరవుల తాంత్రిక సిద్ధ గురువుల ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వార్థాన్ని విడిచిపెట్టి, తోటివారికి సహాయం చేసే గుణం కలిగి ఉంటే దైవానుగ్రహం కలుగుతుందని తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

## పోస్టుమెన్, పంచాయతీ కార్యదర్శి నిర్బంధం

రాజాపేట, డిసెంబర్ 7 : ఫింగర్ ప్రింట్ పడలేదని పింఛన్ డబ్బులు ఆపారని గురువారం మండలంలోని నెమిలే గ్రామంలో పోస్ట్‌మెన్ తరుణ్, పంచాయతీ కార్యదర్శి సంపత్‌ను లబ్ధిదారులు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. విషయం తెలుసుకున్న ఏపీఓ దినకర్ గ్రామానికి చేరుకొని ఫించన్ డబ్బులు అందిస్తామని హామీ ఇవ్వడంతో అధికారులను వదిలిపెట్టారు. జిల్లా పోస్టల్ ఉన్నతాధికారులు సైతం గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు.